దారుణ దారులు



చిత్తడిగా ఉన్న అప్పలరాజుపేట రహదారి

- పెద్ద పెద్ద గోతులతో రోడ్లు
- చినుకు పడితే చిత్తడే
- గిరిజనుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పెద్దపాడు గ్రామంలో రోడ్డు దుస్థితి

డుంబ్రిగుడ: మన్యంలో చాలా గ్రామాల్లో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మన్యంలో చాలా గ్రామాల్లో రహదారుల పనులు ప్రారంభించనున్న తరుణంలో ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా నేటి వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించడం లేదు. గ్రామాలకు సరైన రహదారులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా రహదారి

మండలంలోని పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామానికి గతంలో నిర్మించిన రోడ్డు ఇటీవల రెండుసార్లు వచ్చిన వరదులకు కొట్టుకపోయింది. దీంతో పాటు హుదుహుద్ తుఫాన్ కారణంగా కొట్టుకుపోయిన చంపాపట్టి కాజ్‌వేను నిర్మించి నాలుగు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాని కోరుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుంటసీమ రోడ్డు, సావ్వా రోడ్డు, కొల్లాపుట్టు రోడ్లును కోట్లాది రూపాయలతో నిర్మించారు. పోతంగి, చంపాపట్టి గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలకు రహణా సదుపాయం లేక సంతల్లో అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకోలేకపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పెరిగిన తుప్పలతో ప్రమాదాలు

ముంచంగిపుట్టు: మండలంలో గల సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు గ్రామానికి వెళ్లే రహదారిని బాగుచేయాలని, ఈ దారిని పొడువునా ఇరువైపులా ఉన్న ఏపుగా పెరిగిన తుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామానికి రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి కొన్నేళ్లు అయినా నేటి వరకు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు అసంపూర్తిగా వదిలేయడంలో ఇటీవల వరదల వల్ల పెద్ద పెద్ద గోతులతో దారుణంగా మారాంటున్నారు. గొడుగులపుట్టు గ్రామం రహదారికి ఇరువైపులా తుప్పలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



గొడుగులపుట్టు రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలు

చిత్తడి దారితో సతమతం

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట రహదారి అధ్వానంగా ఉంది. దీంతో పాఠశాలలకు వెళ్ళే పిల్లలు, గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి చిన్న పాటి వర్షానికే చిత్తడిగా మారుతోందని, గ్రామానికి కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం రాజవొమ్మంగికి అప్పలరాజుపేటకు కేవలం రెండు కిలోమీటర్ల దూరం. అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి తదితర లోతట్టు ఆదివాసీ గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వరకు రహదారి పెద్ద పెద్ద గోతులతో ఉండడంతో నానా తిప్పలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారిని మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం



రోడ్డు పనులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించే ఏర్పాట్లు చేస్తాం. మండలంలోని ప్రస్తుతం అనేక రోడ్లు గుర్తించాం. వాటికి సంబందిత జేఈలతో అంచన వేసి జెడ్పీ సీఈవోతో పాటు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో, డుంబ్రిగుడ

సమస్యలు పరిష్కరించాలి



పెద్దపాడు రోడ్డుతో పాటు చంపాపట్టి కాజ్‌వేకు మరమ్మతు చేయాలి. దారులు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. సంపంగి గెడ్డపై వంతెన పూర్తి చేయాలి. వంతెన పూర్తి చేసి గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. అధికారులు సమస్యలు పరిష్కరించాలి.

–వరబోయిన, సుబ్బారావు, సర్పంచ్ కితలంగి పంచాయితీ

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అవసరం



పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రామన్న, నాయకులు

అరకులోయ రూరల్: మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త చెదారాలు, పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు. ఎంపీపీ ఉషారాణి ఆదేశాల మేరకు బుధవారం వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు కలిసి పనులను పర్యవేక్షించారు. మండల పరిషత్ నివాస క్వార్టర్లలో ఉండేవారు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవలన్నారు, నాయకులు నర్సింహమూర్తి, బాలు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి మండల సమస్యలు



జెడ్పీచైర్సన్ సుభద్రకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు రమేష్, మోహన్‌దాస్

హుకుపేట: మండలంలోని కొంతిలి, రంగశీల పంచాయతీల సర్పంచ్‌లు రేగం రమేష్, మోహన్‌దాస్‌లు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను విశాఖలోని ఆమె నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తీర్చాలని వినతి పత్రం ద్వారా కోరారు. నాయకులు శివాజీ తదితరులున్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ బుజ్జిబాబు తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలోని గాలికొండ పంచాయతీ జాబిగొందిలో రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కాకురు బుజ్జిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు బుధవారం పరిశీలించారు. మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణంతో పాటు రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని వారు కోరారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిరణ్, కూటమి నాయకులు పాండు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం



తలబరుసింగిలో కుళాయిని ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీ మారుమూల తలబరుసింగి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద నిర్మంచిన గ్రావిటీ తాగునీటి పథకాన్ని బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్ ప్రారంభించారు. గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.7.50లక్షలతో తాగునీటి పథకాన్ని నిర్మించారు. గ్రామంలో ప్రజావసరాలకు అనుగుణంగా పది కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం

డుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వీఆర్‌వో శెట్టి రవి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. గ్రామసభలో డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్ట్రేషన్, రీ సర్వే పూర్తి చేస్తామని, ఎటువంటి అభ్యంతరాలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సర్వేయర్ సంజిత, రైతులు తదిరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ



కొయ్యూరు ఎస్‌ఐగా కిషోర్ వర్మ



కొయ్యూరు ఎంపీడీవోగా ప్రసాద్



రాజవొమ్మంగి డీటీగా కరీముల్లా



రాజవొమ్మంగి ఆర్‌ఐగా చెల్లమ్మ

కొయ్యూరు: మండలంలోని కొయ్యూరు ఎస్‌ఐగా కిషోర్ వర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన నాగార్జునను ఎటపాకకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో నౌపడ నుంచి కిషోర్ వర్మను కొయ్యూరు ఎస్‌ఐగా నియమించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

కొయ్యూరు: ఎంపీడీవో(ఎఫ్ఏసీ)గా ఎస్.కె.వి.ప్రసాద్‌ను నియమించారు. ఈవోఆర్‌డీగా ఆయన పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడు ఎంపీడీవోగా పనిచేసిన రమేష్‌నాయుడు రెండు నెలల పాటు సిక్ లీవ్ పెట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మేరీరోజ్‌ను గొలుగొండకు బదిలీ చేశారు.ఆమె రిలీవ్ కావడంతో అధికారులు ప్రసాద్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి డిప్యూటీతహసీల్దార్‌గా ఎస్‌కె.కరీముల్లా రెండు రోజుల క్రితం విధుల్లో చేరారు. ఆయన సాధారణ బదిలీ ప్రక్రియలో భాగంగా అడ్డతీగల నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ డీటీగా పనిచేసిన ఎ.సత్యనారాయణ రంపచోడవరం తహసీల్దార్‌గా నియమింపబడ్డారు. మండల ఆర్‌ఐగా ఎస్.చెల్లమ్మ విధుల్లో చేరారు. ఆమె రంపచోడవరంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తు ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా సూర్యారావు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.



డుంబ్రిగుడ ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా ముజీబ్

డుంబ్రిగుడ: మండలంలోని నూతన ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా షేక్ ముజీబ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇక్కడ డీటీగా పనిచేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన నాగమ్మ బదిలీపై రోలుగుంట వెళ్లారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

గంగవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాలలో మండల స్థాయి చెస్, క్యారమ్స్ పోటీలను ఎస్‌ఐ భూషణం, ఎంఈవో మల్లేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. ఎస్‌ఐ భూషణం మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోలీస్‌శాఖ నిర్వహించే కార్యక్రమాలు చట్టాలు, హక్కులు, గురించి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చదరంగం, క్యారమ్స్, పోటీలను ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఎంఈవో–2 మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహించడం విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యత బయటపడుతుందన్నారు. ఎస్ఐ, ఎంఈవోలు కొద్దిసేపు చదరంగం ఆడి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ఏఎస్‌ఐలు రజాక్, సూర్యనారాయణ, హెచ్‌ఎం వై.లక్ష్మి, పీడీలు నాగమణి, ఆదయ్య, పిఈటీలు రామలక్ష్మి, శేఖర్, పద్మావతి, డిప్యూటీ వార్డెన్ లావణ్య, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ భూషణం, ఎంఈవో-2 మల్లేశ్వరరావు

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు

గంగవరం: మండలంలోని ఎండపల్లి గ్రామంలో చేపట్టనున్న ఉపాధి పనులపై స్థానికులకు ఏపీవో ప్రకాశ్ అవగాహన కల్పించారు. గ్రామంలో చేపట్టనున్న ఉపాధి పనులపై సర్పంచ్ బి.రామలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డుదారులందరికీ పనులు కల్పిస్తామన్నారు. పంచాయతీకి కేటాయించిన లక్ష్యం ప్రకారం 33 వేల పది దినాలను లబ్ధిదారులు పూర్తి చేసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇంకుడు గుంతలు, పొలాల్లో ట్రెంచ్ వర్కులు, రాతి కట్టడాలు, ఫారం పాండ్లు తదితర పనులు కల్పిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ బి.రామలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ ప్రభ, మాజీ సర్పంచ్ సూరమ్మ , కార్యదర్శి శివ, గణపతి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

అడ్డతీగల: తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి వైద్యం కోసం అడ్డతీగలలోని హోసన్నా హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు విరాళం అందజేశారు. అడ్డతీగలకు చెందిన డంకాల హేమ నవిత(8) తీవ్ర అనారోగ్యానికి గురై విశాఖపట్నంలోని రెయిన్‌బో ప్రైవేట్ ఆస్పత్రి చికిత్స పొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న హోసన్నా హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులంతా కలసి తమ వంతు సాయంగా రూ.40 వేలు సేకరించి బాధిత కుటుంభానికి బుధవారం అందజేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సందీప్ తెలిపారు.

108 సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

ఎటపాక: సమస్యల పరిష్కారం కోరుతూ 108 సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి మూడు పీహెచ్‌సీల పరిధిలో నిరసన తెలిపారు. మూడు నెలలుగా వేతనాలు మంజూరు చేయకపోవటం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంక్రిమెంట్లు పెంచాలని, త్వరలో ప్రభుత్వం నియమించే ఈఎంటీ ఉద్యోగాల్లో తమను తీసుకోవాలని కోరారు. మహేష్ గౌరిదేవిపేట, నెల్లిపాక, లక్ష్మీపురం పీహెచ్‌సీల 108 సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

అరకులోయ రూరల్: మండలంలో సిర్గం పంచాయతీ పరిధిలో ఉన్న తోకవలస గ్రామంలో పూర్తి స్థాయిలో రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, అత్యవసర సేవలకు అంతరాయం కలుగుతుంది, దీంతో గ్రామస్తులందరూ కలిసి బుధవారం శ్రమదానంతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గోపాల్, శ్రీరామ్‌లు మాట్లాడుతు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, వర్షాకాలంలో గెడ్డల ఉధృతం వల్ల పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నామన్నారు. గ్రామనికి వాగు ఉండడంతో ప్రతి ఏడాది శ్రమదానంతో రహదారి ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. వర్షలు వస్తే పూర్తిగా కొటుకుపోతుందన్నారు. తోకవలస గ్రామ గెడ్డలో రహదారి నిర్మాణం చేసి శాశ్వత వంతెన ఏర్పాటు చేయాలని, రహదారి నిర్మాణానికి ప్రభుత్వం అవసరమైన నిధులు మంజురు చేయాలని కోరారు. గ్రామస్తులు ఒన్నది, భగత్, అప్పారావు, కృష్ణ, ధన్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పనుల్లో నిమగ్నమైన గ్రామస్తులు

పాఠశాలకు దాతల వితరణ



తాజంగి పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థి క్రాంతికుమార్

చింతపల్లి: మండలంలోని తాజంగి జీయూపీ పాఠశాలకు పూర్వ విద్యార్థి పెనుమల క్రాంతికుమార్ వితరణగా ఇచ్చారు. ఆయన పాఠశాలను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి నారాయణ ఈ పాఠశాలలోనే విద్యనభ్యసించారని, ఆయన జన్మదినం సందర్భంగా కంప్యూటర్‌ను అందజేసినట్టు చెప్పారు. విద్యార్థులు కంప్యూటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. విద్యా కమిటీ చైర్మన్ శెట్టి మోహన్‌రావు, ఉగ్రంగి లక్ష్మణరావు, శంకరరావు, సత్తిబాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో పాఠశాలకు టీవీ అందజేస్తున్న దాతలు, చిత్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ పాటిగరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో ప్రవాస భారతీయురాలు పి.శిరిష దంపతుల ఆర్థిక సాయంతో బుధవారం విద్యార్థులకు కంచాలు, పాఠశాలకు టీవి, 150 అడుగుల గ్రీన్‌మేట్ పంపిణీ చేశారు. దాతలు శిరీష దంపతులను సేవలను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. హెచ్‌ఎం కోటిబాబు, ఉప సర్పంచ్ సోమేలి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సూచనలు

అనంతగిరి(అరకులోయ రూరల్): జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించే దిశగా ఉపాధి హమీ పథకం సిబ్బంది పనిచేయాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధి హమీ పథకం సిబ్బందితో బుధవారం సమవేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఉపాధి హమీ పనులపై విత్సృతంగా అవగాహన కల్పించాలన్నారు. వంద రోజుల పనిదినాలు కల్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు కూలీ వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మస్తర్లు, పనుల కూలీల విషయంలో తప్పుడు లెక్కింపులు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పదన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కుమార్

ఆత్మీయ సన్మానం

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో తేజరతన్‌కు బుధవారం మండలానికి చెందిన పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువ కప్పి, బొకేలను అందించి ఘనంగా సన్మానించారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎంపీడీవో దృష్టి సారించాలని వారు కోరారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, మాలన్న, రాజులమ్మ, సూరిబాబు, పలాసి కృష్ణకుమారి, కొండబాబు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, వైఎస్సార్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రామకృష్ణ, నాయకులు సూర్యప్రకాష్ నాయుడు, గంగరాజు పెదబాలన్న తదితరలు పాల్గొన్నారు.



ఎంపీడీవో తేజ్‌రతన్‌ను సన్మానిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి భావన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు సాధారణ, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. హెచ్‌వీ విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్లు కృష్ణవేణి, రత్నకుమారి, ఏఎన్‌ఎం పద్మప్రియ, చెల్లాయమ్మ, ఆశ కార్యకర్త రామాయమ్మ తదితరులు సేవలందించారు. ఎస్‌ఐ భూషణం, హెచ్‌ఎం లక్ష్మి, వార్డెన్ లావణ్య, సందర్శించి పరిశీలించారు.



బాలికలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి భావన

భక్తిశ్రద్ధలతో చండీహోమం

సీలేరు: సీలేరులోని మారెమ్మ తల్లి ఆలయంలో కొవ్వూరుకు చెందిన అనసూయ ధార్మిక శక్తి కేంద్రం నిర్వాహకులు సలాది సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నవచండీ హోమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ మారెమ్మ తల్లి ఆలయ సన్నిధిలో లక్ష్మి గణపతి సహిత, మన్యు సూక్త సహిత, రుద్రహోమం నిర్వహించినట్టు తెలిపారు. లోక కల్యాణార్థం, గ్రామమంతా సుభిక్షంగా ఉండేందుకు హోమం చేసినట్టు పేర్కొన్నారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



యాగం చేస్తున్న భక్తులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొయ్యూరు: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను బుధవారం బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పలు రెవెన్యూ సమస్యలను ఆయన వివరించారు.వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన కొయ్యూరు ఎస్ఐ కిషోర్‌వర్మను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నేతలు రాజు, అప్పలరాజు, చిన్న తదీతరులున్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

ఎటపాక: సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రెబల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. యూత్ నాయకులు రంభాల కార్తీక్ ఆధ్వర్యంలో పట్టుచీర గ్రామంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. రాము, రాజు, మధు, సతీష్, రాంబాబు, శ్రీకాంత్, వెంకటేష్, వీరు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎటపాకలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న కార్తీక్ తదితరులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సినీనటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయ్, మురళి, సురేష్, గుండు, రవి, కిరణ్, చంటి, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి గ్రామాల సమస్యలు

కూనవరం: చినార్కూరు సర్పచ్ సున్నం అభిరాం ఆ పంచాయతీ పరిధిలోని పలు సమస్యలను బుధవారం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు పాడేరులో ఆయనకు వినతిపత్రం అందజేశారు. పంద్రాజుపల్లి గ్రామాన్ని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు కింద మొదటి ప్రాధాన్యత గ్రామంగా గుర్తించి సర్వే చేశారని, అయితే అందులో 85 ఇళ్లు ఆర్‌అండ్‌ఆర్ నోటిఫికేషన్‌లో రాలేదని వాటిని కూడా సర్వే చేసి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. దీంతో పాటు మండలంలోని చినార్కూరు– బోదునూరు, తెల్లవారి గుంపు– శబరి కొత్తగూడెం వరకు రహదారులు నిర్మించాలని, చినార్కూరు–టేకులబోరు రోడ్డుకు మరమ్మతులు కోరారు. పంచాయతీలో తాగునీరు, రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ అభిరాం తెలిపారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ అభిరాం తదితరులు